# నిన్ను నీవు తెలుసుకో

## వీరరాజు

ఛ, ఛ. . . . ఈ మనుషుల మీద నాకు నమ్మకం పోతోంది" వచ్చీ రావడంతోనే ఎదురుగా వున్న కుర్చీని విసురుగా సునీల్ పక్కకు లాగి, కూర్చుంటూ అన్నాడు నారాయణ

పేపర్‌లో 'వాంటెడ్ కాలమ్స్'ని అతి సీరియస్‌గా చూస్తున్న సునీల్‌కి అతని మాటలు వినపడినప్పటికీ, ఏమీ కామెంట్ చేయకుండా వూరుకున్నాడు

"ఆ వుద్యోగాలు మనకొచ్చి ఏడవ్వుగానీ కొంచెం పేపరు అవతల పడేయరా!" సునీల్ చేతిలోని పేపరు చనువుగా లాక్కుని మడిచి పక్కన పెడుతూ - అన్నాడు కొంచెం విసుగ్గా.

"నీకేరా బాబూ! కొద్దో గొప్పో వెనకాల వుంది. ఎన్ని కబుర్లయినా చెబుతావు. మరి నాలాంటి సామాన్యుడికి తప్పదుకదా! యిప్పటికే రిటైరైపోయిన మనిషిలా యింట్లోవాళ్ళ మీద పడి బతుకుతున్నాను. ఈ సంవత్సరంలోగా నాకు వుద్యోగం రాకపోతే మాత్రం మా నాన్న, అదేదో సినిమాలో చూపించినట్లు ఏ మంగలి షాపులోనో పెట్టేస్తాడు." అన్నాడు నవ్వుతూ, ఆ నవ్వులో ఏదో వెలితి కనిపించింది.

"ఈ పెద్ద వాళ్ళకి అసలు బుద్ధి వుండదు. వుద్యోగం రాకపోతే అది మన తప్పా? వెళ్ళిన యింటర్వ్యూలో సెలక్టు కాకపోతే అది మన నేరమా? అదేదో మన తప్పయినట్లు ఒక క్రిమినల్‌గా మనల్ని చూస్తారు. అటు వుద్యోగం రాక యిటు వీళ్ళ చూపుల విసుగుదల చూస్తుంటే జీవితం మీద విరక్తి కలుగుతోంది" కోపంగా అన్నాడు నారాయణ

"అది సరే గానీ, ఏవిటి యివ్వాళ అంత కోపంగా వున్నావ్ . . వచ్చీ రావడంతోనే సమాజం మీద, మనుషుల మీద విరుచుకు పడిపోతున్నావ్?" అడిగాడు సునీల్.

"నిజంగా ఈ దేశంలో పుట్టడం కంటే ఏ ఆఫ్రికా అడవుల్లో పుట్టినా బాగుండేదిరా. ఇక్కడి మనుషులకన్నా అక్కడి జంతువులే నయమనిపించేట్టుంది" అన్నాడు నారాయణ.

"మరీ అంత దారుణంగా మాట్లాడకు ఈ భూమ్మీద పుట్టినందుకు, ఈ గాలి పీలుస్తున్నందుకు, యిక్కడి నీళ్ళు తాగుతున్నందుకు మనం ప్రతి క్షణం గర్వించాలి" నవ్వుతూ అన్నాడు సునీల్

"అవును, యింత పెద్ద దేశాన్ని చూసి నువ్వే గర్వించాలి . . ఎందుకంటే నీలాంటి నిరుద్యోగులందరికీ చాల వుపకారాలు చేస్తుందికదూ!" వ్యంగంగా అన్నాడు

"చూడు నారాయణా! చదువుకుని కూడా ఏమీ తెలీని వాడిలా ఎంత అమాయకంగా మాట్లాడుతున్నావ్ నీకు వుద్యోగం లేదని దేశాన్నే దుయ్యబడుతున్నావ్ ఆఫ్‌కోర్స్ నీ కడుపు మంటతో నీకలా అన్పించవచ్చు. కానీ నీ అభిప్రాయం తప్పు అమెరికా, ఇంగ్లండు వంటి సంపన్న దేశాలు కూడా పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలతో సతమతమవుతున్నాయి అయితే అవన్నీ మనకు తెలియకపోవచ్చు. దూరపు కొండలు నునుపు మాదిరి ఆయా దేశాల్ని చూసి మనం ఏవేవో వూహించుకుంటూ కలలు కంటుంటాం. అంతే!" ఆవేశంగా అన్నాడు సునీల్

"నీ దేశభక్తి మెచ్చుకున్నానురా నాయనా! పొద్దున్నే వాయించేయకు – అసలు స్వాతంత్ర్యానికి ముందు నువ్వు పుట్టుంటే దేశం ఇంకో భక్తుడ్ని గురించి గొప్పగా చెప్పుకుని వుండేది" నవ్వుతూ అన్నాడు నారాయణ

"హమ్మయ్య వచ్చిన యింతసేపటికి నీ మొహం మీద నవ్వు కనిపించింది యిందాకట్నుంచీ ఒకటే సీరియస్ ఫోజు "ప్రతిపక్ష నాయకుడిలా," జోక్ చేస్తూ అన్నాడు సునీల్

ఇంతలో సునీల్ తల్లి కాఫీ కప్పులతో వచ్చింది. ఒకటి నారాయణకిస్తూ అంది "ఏం బాబూ! ఈ మధ్య బొత్తిగా కనపడ్డం మానేశావ్, వూళ్ళో లేవా?"

"అవునమ్మా! ఈమధ్య రాజమండ్రి వెళ్ళాను వీడు చెప్పలేదా"? అంటూ సునీల్ వైపు తిరిగి "ఏరాసునీల్, అమ్మకు చెప్పలేదా?" అన్నాడు

"మర్చిపోయానురా" అన్నాడు సునీల్

"అది సరేగానీ భోంచేసి వెళ్ళు బాబూ" అంది - సునీల్ తల్లి

అదే ఆవిడలోని గొప్పతనం. ఎవరింటికి వచ్చినా, భోజనం చేసి వెళ్తేనేగానీ ఆమెకు తృప్తి వుండదు ఒకరికి పెట్టే గుణం ఈ రోజుల్లో ఎవరికోగాని వుండటంలేదు ఆమె గుమ్మంలోకి వచ్చిన ముష్టివాడు సైతం వట్టి చేతులతో ఏ రోజు వెళ్ళలేదు. అందుకే ఆమెకు కొడుకుగా పుట్టినందుకు సునీల్ ఎంతో గర్విస్తుంటాడు

"ఎందుకమ్మా! ఎలాగూ యింటికెళ్ళి చేసేదేగా, యిప్పుడేమీ వద్దు . . కాఫీయే దండుగ మాలాంటి నిరుద్యోగులకి. పైగా భోజనం కూడానా?" నవ్వుతూ అన్నాడు నారాయణ.

"తప్పు బాబూ! అలా నిన్ను నువ్వు కించపర్చుకోకూడదు వచ్చినప్పుడే వస్తుంది వుద్యోగం దానికి మరీ అంత బాధపడాలా?" అంది ఆమె అక్కడే వున్న కప్పుల్ని తీసుకుని వెళుతూ!

"ఒరేయ్ నారాయణా అమ్మ సంగతి తెల్సుగా, బెట్టు చేయక ఫుడ్ కొట్టేసి వెళ్ళు" అన్నాడు సునీల్.

"ఆ మాటలకు నారాయణ సునీల్ వైపు తిరిగి, "ఏం నాయనా, రూమ్‌లోకి తీసుకెళ్ళి ఏ కొత్త కథైనా వినిపించడానికి యిదేమీ లంచం కాదుకదా?" అనుమానంగా అడిగాడు.

"నువ్వేమీ ఆ దిగులుపెట్టుకోవద్దు గానీ పైకి పద" నవ్వుతూ అన్నాడు

"సరే! తప్పుతుందా? నడు" అన్నాడు నారాయణ.

★ ★ ★ ★

"ఇప్పుడు చెప్పు ఇందాక నువ్వన్నావు కదా! ఈ మనుషుల మీద నమ్మకం పోతోందని . నీ కెందుకలా అన్పించింది?" అడిగాడు సునీల్.

"ఆ మాట నువ్వింకా మర్చి పోలేదా? అబ్బ ఈ రచయితలతో వచ్చిన చిక్కే అది. ఏదైనా పట్టుకుంటే రాజకీయ నాయకుల్లా సాగదీసి వదులుతారు" చిరు కోపంగా అన్నాడు

నువ్వు చెప్పింది నిజమేనేమో గానీ పూర్తిగా కాదు. ఎందుకంటే ఏ రచయితనైనా సమాజాన్ని, మనుషుల్నీ పూర్తిగా అర్థం చేసుకుని రకరకాల మనుషుల మనస్తత్వాన్ని కథల్లో చిత్రీకరించడానికి ప్రయత్నిస్తుంటాడు అలా రాసిన కథలూ, రచయితలూ పది కాలాలపాటు పాఠకులకి గు[illegible] టారు చవకబారు రచనలు తాత్కాలి[illegible] ఒకవర్గం పాఠకుల్ని ఆకట్టుకున్నా ఎక్కువ కాల[illegible] మనలేవు".

అంతవరకు ఎందుకు? ప్రఖ్యాత బెంగాలీ రచయితలు శరత్‌బాబు, ప్రేమ్‌చంద్, ఠాగూర్ మన తెలుగు రచయితలు కుటుంబరావు, బుచ్చిబాబు, గోపీచంద్‌లను తీసుకో వారి రచనల్లో మనుషుల వ్యక్తిత్వాన్ని, మనస్తత్వాన్ని ఎంతో అద్భుతంగ చిత్రీకరించారు అందుకే వారు లేకపోయినా, యిప్పటికీ వారి రచనలు పాఠకుల్ని విపరీతంగా ఆకర్షిస్తున్నాయి.

"కానీ అప్పటికీ యిప్పటికీ మనుషుల్లో విపరీతమైన మార్పు వచ్చింది" నారాయణ అన్నాడు.

"కరక్టే . .మనిషి నాగరికంగా చాల ఎత్తుకు పెరిగాడు అలాగే సైన్సు బాగా అభివృద్ధి చెందడం వలన సాంకేతిక పరిజ్ఞానాన్ని బాగా పెంపొందించుకున్నాడు." అన్నాడు సునీల్.

"నేను చెప్పేది నువ్వనుకునే మార్పు గురించి కాదు. అప్పటి మనుషుల్లో వున్న మంచితనం, మానవత్వం యిప్పటి ప్రజల్లో లేదు జనంలో నిస్సి[illegible] లోపించింది – ప్రతి మనిషిలోనూ స్వార్థం ప్రబలిపోతోంది. తను బాగుపడ్డం కోసం ఎదుటి మనిషిని ఏమైనా చేయడానికి వెనుకాడటంలేదు." ఆవేశంగా అన్నాడు నారాయణ

తర్వాత రెండు క్షణాలాగి మళ్ళీ అన్నాడు. "అంతెందుకు? నీకో విషయం చెబుతాను, విను ఆ మధ్య నేను నాన్నగారితో కలిసి ఏదో పని మీద రాజమండ్రి వెళ్ళవలసి వచ్చింది ట్రైను చాల రద్దీగా వుంది జనరల్ కంపార్ట్మెంట్‌లో జనం కుమ్మేసుకుంటున్నారు నాన్నగారికి ఆరోగ్యం బావుండలేదు. నించోడానికి కూడ ఓపిక లేదు ఆ విషయమే కో - పాసింజర్లకి చెప్పి బ్రతిమిలాడాను. ఒక్కరంటే ఒక్కరు కూడ జరిగి చోటివ్వలేక పోయారు మామూలు మనిషైతే ఫర్వాలేదు. కానీ రోగంతో నున్న మనిషని చెబుతున్నా, సానుభూతి చూపించకుండ ప్రవర్తించారంటే ఏమనుకోవాలి?" నారాయణ గొంతులో బాధ, ఆవేశం మిళితమై వున్నాయి

"అయితే మనుషుల్లో మంచితనం, మానవత్వం పూర్తిగా నశించిందంటావ్? అంతేగా!" అన్నాడు సునీల్.

"ముమ్మాటికీ అంతే", ధృడంగా పలికాడు.

"నేను ఒప్పుకోను . మంచితనం మానవత్వం .. ఎక్కడైనా వుంటాయి. నీ మనస్సు మంచిదయితే నీకు మంచే జరుగుతుంది."

"నీ కథల్లో డైలాగులు ఇక్కడ చెప్పకు" కోపంగా అన్నాడు.

నారాయణతో వచ్చిన చిక్కదే. ఏ సబ్జక్టు మీద డిస్కస్ చేసినా ఒక వైపే ఆలోచిస్తాడు. వాదప్రతివాదనల్లో త్వరగా ఆవేశపడిపోతాడు అతని ...నికి అలవాటు పడిపోయిన మనిషి కాబట్టి సర్దుకుపోవడం సునీల్‌కేమీ కొత్త కాదు.

అలాగని నారాయణను విప్లవాదీ, తిరుగుబాటుదారుడు అని మాత్రం అనడానికి వీల్లేదు. అతనిది కేవలం అమాయకత్వంతో కూడిన ఆవేశం.

మౌనంగా వున్న నారాయణను చూసి, "సరే ఈ డిస్కషన్ యిక్కడితో ఆపేద్దాం కిందకు పద. .. అమ్మ పిలుస్తున్నట్టుంది" అన్నాడు సునీల్.

భోజనం పూర్తయిన తర్వాత అన్నాడు నారాయణ "ఎల్లుండి కృష్ణగాడి పెళ్ళికొస్తున్నావా?" అని.

కొంచెంసేపు ఆలోచించి అన్నాడు సునీల్ "సారీ, రావడానికి కుదర్దు. నాకొంచెం అర్జెంటు పనుందని చెప్పు" అని. "యింతకీ నువ్వే బండికి వెళుతున్నావ్?" అడిగాడు.

"ఎల్లుండి రాత్రి 8.30 బస్సుకి వెళ్ళుతున్నాను." అనేసి వెళ్ళిపోయాడు

* * * *

బస్సు రద్దీగా వుంది.

జనం ఒకరినొకరు తోసుకుంటూ, తొక్కుకుంటూ, తిట్టుకుంటూ నిలబడ్డారు. బస్సులో వున్న ఒకటి రెండు లైట్లు బాగా డిమ్‌గా వెలుగుతున్నాయి ఎండా



కాలమేమో వళ్ళంతా చెమటలు పట్టి చికాగ్గా వుంది.

బస్సు బయలు దేరింది.

ఇంతలో - 'బాబూ కాస్త చూసుకుని నిలబడండి, నా కాలు తొక్కేస్తున్నారు'

ఆ గొంతు వినబడిన వైపు వెనుదిరిగి చూశాడో యువకుడు-

బాగా పండి పోయిన పీచు లాంటి తెల్లని జుట్టు, పొడుగాటి తెల్లని గడ్డం-మాసిపోయి వంటి మీద వేలాడుతోన్న అంగీతో చూడ్డానికి అసహ్యంగా కనపడుతున్నాడు వెంట తెచ్చుకున్న కర్ర బస్సులో కుంచ పెట్టవలసి రావడంతో బస్సుకుదుపులకి నిలదొక్కుకోడానికి చాల యాతన పడుతున్నాడు

ఆ యువకునికి ముసలాయన్ని చూస్తే జాలి వేసినట్టుంది. 'ఒరేయ్ మురళీ' అని గట్టిగా కేకేసాడు

'ఏమిటిరా?' అవతల్నుంచి మురళి అనే యువకుడు పలికాడు

'ఏం లేదు. నీ సీటు ఖాళీ చేసి ఈ ముసలాయనకివ్వు కూర్చుంటాడు' అన్నాడు.

'సరే! రమ్మను', అన్నాడు మురళి

'వెళ్ళు తాతా! వెళ్ళి ఆ సీటులో కూర్చో. పాపం, ఎంత సేపని నిలబడ తావు?' అన్నాడాయువకుడు సానుభూతిగా

'పర్వాలేదులే బాబూ! అయినా నేను వెళ్ళేది కొం-

## పొట్టివారికి వరప్రసాదం!

పొట్టిగా వున్నామని దిగులుపడే వారికి ఒక వరప్రసాదం రాబోతున్నది. మనుషుల పొడుగుని పెంచే హార్మోన్ సొమాటో ట్రాఫిన్పై పరిశోధనలు సాగుతున్నాయి. రసాయనికంగా శుద్ధి చేసిన సొమాటో ట్రాఫిన్ను వినియోగిస్తే ఏటా అయిదు నుండి 12 సెంటీ మీటర్ల పొడుగు పెరిగే అవకాశం వుంటుంది

ఈ హార్మోన్ కేవలం మనిషి పొడుగును మాత్రమే కాక, ఆల్బుమిన్ను కొవ్వు పదార్థాలను, కార్బోహైడ్రేట్ మార్పిడిని, రోగ నిరోధక వ్యవస్థని కూడా నియంత్రిస్తుంది

సొమాటో ట్రాఫిన్ ప్రాతిపదికగా అనేక రోగాలకు నివారణ ఔషధాలు రూపొందించవచ్చుని, శరీరంలో కొవ్వును తగ్గించడానికి, కాల్పులు ఎముకలు విరిగిన గాయాలు వేగంగా మాన్పడానికి ఔషధాలు తయారు చేయవచ్చునని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు (ఎ పి. ఎస్.)

## నిన్ను నీవు తెలుసుకో

చెం దూరమే! ఏలూరు వరకు పోవాలి' అన్నాడు కొద్దిగా ఆయాసపడుతూ!

'ఫర్వాలేదు తాతా! కుర్రాళ్ళం మేమెంత సేపైనా నించోగలం నువ్వెళ్ళి కూర్చో' అన్నాడు

ఈలోగా ఓ కుర్రాడు ఆ ఖాళీ అయిన సీటుని ఆక్రమించేసాడు

'లేవయ్యా! బాబూ! లే! నీ కోసమే ఖాళీ చేసాననుకుంటున్నావా పిచ్చి తండ్రీ? అదిగో ఆ ముసలాయన కోసం' అంటూ ఆ కుర్రాడ్ని జబ్బ పట్టి లేపి ఆ సీట్లో ముసలాయన్ని కూర్చోబెట్టేడు

ముసలాయన కళ్ళు కృతజ్ఞతతో మెరిసాయి!

ఆ యువకుని వంక వాత్సల్యంతో చూసాడు

* * * *

బస్సు ఏలూరు చేరుకుంది

అందరూ హడావుడిగా తమ సామాను చేత పుచ్చుకుని దిగిపోతున్నారు


ఐదు నిమిషాల్లో బస్సంతా ఖాళీ అయిపోయింది

'ఒరేయ్ నారాయణా ఆగరా!' వడివడిగా అడుగు లేస్తున్న నారాయణ ఆగి వెనక్కి తిరిగి చూశాడు

ఇందాక తను బస్సులో చూసిన ముసలాడు

ఆ ముసలాడ్ని ఎక్కడా చూసినట్టు గుర్తులేదు. బహుశా నాన్నగారికి తెలుసునేమో అనుకున్నాడు అయితే మాత్రం 'ఒరేయ్' అంటూ పిలుస్తాడా ఎంత పొగరు?

ముసలాడు దగ్గరకొచ్చి ఆగేడు. కోపంగా అటువైపే చూస్తూ 'ఎవరయ్యా! నువ్వు? ఆ పిలుపేమి వయస్సుతో పాటు మర్యాద, మంచితనం పెర



తరక్కాడదు కోపంగా అన్నాడు

ఆ మాటలకు ముసలాయన విరగబడి నవ్వాడు ఏమిటిరా? అంత కోపం . నన్ను గుర్తుపట్టలేదు నేను 'సునీల్'నిరా అంటూ నవ్వసాగాడు

"అరె, నువ్వా! ఆ బస్సులో వచ్చింది నువ్వే కదూ! ఏమిటి ఫ్యాన్సీ డ్రస్సు?" ఆశ్చర్యంగా అడిగాడు

'నీ కోసమేరా బాబూ! ఈ అవతారం పెట్టుకున్న గడ్డాన్ని సవరించుకుంటూ అన్నాడు

అవునూ, నాకోసమంటున్నావేమిటి? మరీ ఆశ్చర్యపోతూ అడిగాడునారాయణ.

ఆ రోజు నాతో వాదించావు గుర్తుందా?మనుషుల్లో మంచితనం, మానవత్వం పూర్తిగా నశించిందనీ, స్వార్థం బాగా పెరిగిపోయిందని నీ అభిప్రాయం తప్పని నిరూపించడానికే ఈ అవతార

మెత్తాను చూశావుగా నన్ను చూసి జాలిపడి నాకెలా సహాయం చేసారో!

'నారాయణా! నువ్వూ నాతో పాటు ఆ బస్సులో వున్నావ్ నన్ను కొంచెం కూడ గుర్తుపట్టలేదు. అదీ ఒకందుకు మంచిదైంది కానీ నా పరిస్థితి చూసి ' కూడా నువ్వా సమయంలో ఎందుకు సహాయం చేయలేకపోయావ్! ఇన్ని కబుర్లు చెప్పే నువ్వు నీ అంతట నువ్వు ఓ ముసిలాడికి నీ సీటుని త్యాగం చేయలేకపోయావు . కారణం నీ స్వార్థం ఎక్కువ దూరం నిలబడి వెళ్ళే ఓపిక నీకున్నా ఎందుకు నిలబడాలన్న మూర్ఖత్వం . ఆ రోజు అన్నావు గుర్తుందా? మా నాన్నగార్ని వూరికి తీసుకెళ్తుంటే ఎవ్వరూ కొద్దిగా కూడ జాలి చూపించి తమ సీటుని త్యాగం చేయలేకపోయారని ఎలా చేస్తారు? ఆ సమయంలో అక్కడున్నదీ నీలాంటి మనుషులే . ప్రతి మనిషీ తన స్వార్థమే కాకుండా ఎదుటి మనిషి కష్టాన్ని అర్థం చేసుకుంటే లోకం నిండా మంచే మిగులుతుంది ఎవరో ఏదో చేస్తారని నువ్వెప్పుడూ అనుకోవద్దు ముందు నిన్ను నీవు తెల్సుకో సాటి మనిషిని ప్రేమించడం నేర్చుకో ప్రతి మనిషీ అలా అనుకున్న రోజున మంచి సమాజం ఏర్పడ తుంది " ఆవేశంగా అన్నాడు

అప్పటివరకూ మౌనంగా వింటున్న నారాయణ, సునీల్ మాటలకు "హేయ్ సునీల్ రియల్లీ యూ ఆర్ గ్రేట్ నీలో యింత విజ్ఞానం, సంస్కారం వుందని నాకు తెలీదురా! నిజంగా నీ తెలివితేటల్ని, సమయస్ఫూర్తిని మెచ్చుకుంటున్నాను. నీ ప్రాక్టికల్ నాలెడ్జ్కి నా జోహార్లు .. నీ ముందు సగర్వంగా ఓడిపోతున్నాను పద .. పెళ్ళికి టైమవుతుంది అన్నాడు ముందుకు కదుల్తూ.

'పద' అన్నాడు, సునీల్

ఈ వేషంతో నా? జనం భయపడతారు'

సునీల్ నవ్వి వూరుకున్నాడు

ఈ వేషం అంత చక్కగా ఎలా కదిరిందిరా? అసలు

## నిన్ను నీవు తెలుసుకో

నిన్ను గుర్తు పట్టలేకపోయానంటే నమ్ము పైగా గొంతు కూడా మార్చేసావ్" అన్నాడు నారాయణ ఆశ్చర్యపోతూ.

. ఫ్యాన్సీ డ్రస్ పోటీలో ఈ వేషానికి నాకెప్పుడూ ఫస్ట్ ప్రైజే అంతెందుకు . ఓసారీ వేషంలో కాలేజీ నుంచి యింటికెళితే అమ్మకూడా గుర్తుపట్ట లేక పోయింది " నవ్వుతూ అన్నాడు సునీల్

సునీల్ నవ్వుతో శృతి కలిపాడు నారాయణ

ఇద్దరూ చెట్టాపట్టాలేసుకుని, మధులత లాడ్జి వైపు బయలుదేరారు – వేషం మార్చుకోడానికి! □

# సుభాషితాలు

సుఖార్థీ చేత్ త్యజే ద్విద్యాం
విద్యార్థీ చేత్ త్యజేత్సుఖమ్!
సుఖార్థినః కు తో విద్యా
కుతో విద్యార్థిన స్సుఖమ్!!

స్వగృహే పూజ్యతే మూర్ఖః
స్వగ్రామే పూజ్యతే ప్రభుః!
స్వదేశే పూజ్యతే రాజా
విద్వాన్ సర్వత్ర పూజ్యతే!!







సుఖాన్ని కోరేవారైతే విద్యను విడచి పెట్టాలి విద్యను కోరు వారైతే సుఖాన్ని విడిచిపెట్టాలి సుఖాన్ని కోరే వారికి విద్య ఎలా అబ్బుతుంది? విద్యార్థికి సుఖమెక్కడుంటుంది?
(నిరంతర పరిశ్రమ వల్లనే విద్యార్జన సాధ్యమౌతుందని భావము).

మూర్ఖుడు తన యింటిలో మాత్రమే గౌరవింపబడతాడు ధనవంతుడు తన గ్రామంలో మాత్రమే గౌరవింపబడతాడు రాజు తన దేశంలో మాత్రమే గౌరవింపబడతాడు. విద్వాంసుడైతేనో అన్ని చోట్ల గౌరవింపబడ తాడు

–ఆయుర్వేద శిరోమణి రాజ రాజేశ్వర శర్మ


ఇంకా పొడుగు ఎదగండి



2'' – 8''
నూతన శాస్త్ర పద్ధతులలో వ్యాయామములతో ఎక్కువ పొడుగుకండి. ఆరోగ్యవంతులు అవండి. స్త్రీ పురుషులకు ఎల్లరకు అనువైనది. దీని వంటి కోర్సు, లేక పుస్తకం మరొకటి ఎంతమాత్రం లేదు. వివరములకు హిందీలోగాని తెలుగులోగాని ఉచితం.
NEW C.T. HOSPITAL
806, Dr. Mukerjee Nagar, Delhi-9.